క్లుప్తంగా

షాపింగ్ కాంప్లెక్స్ పనుల పరిశీలన

ఏర్పేడు: స్థానిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ డీఈ ఎస్ఆర్ రాజశేఖర్ సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో ఏర్పేడులో 11 దుకాణాల నిర్మాణాల పనుల కోసం రూ.57 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ శివచంద్ర, కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా చెల్లాతమ్మ ఉత్సవం



సత్యవేడు: మండంలోని మల్లవారిపాళెం వెస్ట్ పంచాయతీలో చెల్లాతమ్మ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం రాత్రి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు సోమవారం ఉదయం వరకు సాగింది. ఊరేగింపు సందర్భంగా వీధుల్లో విద్యుత్‌దీప అలంకరణ చేట్టారు. మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుస్తూ భక్తులు అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపుగా వచ్చిన అమ్మవారికి ఇంటింటా హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. అమ్మవారి జాతర సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.

వైద్య శిబిరం విజయవంతం



రేణిగుంటలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రేణిగుంట: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సర్పంచ్ నగేషం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పాస్ స్వచ్ఛంద సంస్థ స్విమ్స్ సహకారంతో ఐదురకాల రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. హెచ్ఐవీ, ఆర్‌టీఆర్, హెపటైటిస్–బి, సీ వంటి పరీక్షల నిమిత్తం ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరించారు. పాస్ సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈనెల 30న మరోసారి రేణిగుంటలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎం జ్యోతి, హేమలత పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను తహసీల్దారు భార్గవి ఆదేశాలతో వీఆర్‌ఓ రంగయ్య సీజ్ చేశారు. సోమవారం వాటిని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని కాళంగినదిలో ఇసుక రీచ్‌లు లేవన్నారు. అలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ పనులు, ఇంటి అవసరాల కోసం ఏఈఈల వద్ద పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ



మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారి రాధారాణి

సత్యవేడు: ఉద్యాన పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ, యాజమన్య పద్ధతులపై రాజగోపాలపురం గ్రామ రైతులకు హార్టికల్చర్ అధికారి రాధారాణి సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడితోటలో పంట కోత అనంతరం కొమ్మల కత్తిరింపు, ఎరువులు, నీటి యాజమాన్యం గురించి వివరించారు. పూలతోటలు, కూరగాయల పంటల సాగులో సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై ఎరువులు, యంత్రపరికరాలను అందిస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ప్రభుత్వ వైద్యం

శ్రీరంగరాజపురం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇళ్ల వద్దకే ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యమని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. సోమవారం ముద్దుకుప్పం సచివాలయ పరిధిలోని చొక్కమడుగు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలకు వచ్చిన రోగులు, గర్భిణులకు పలు సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పాలు, కోడి గుడ్లు, చిక్కీలు, రాగి, గోధుమ, ఎండు ఖర్జూరం వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం



విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తెలుగు అక్షరాకృతిలో విద్యార్థుల ప్రదర్శన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నేడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలను తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీమురళి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాషా పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. అలాగే పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు రోజుకో అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి తెలుగు భాషా దినోత్సవం రోజున బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. తెలుగు అక్షరాకృతిలో కూర్చుని విద్యార్థులు తెలుగు భాషాభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు ప్రసాద్, లక్ష్మయ్య, వేణుగోపాల్, మాధవీలత, దాసు, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ దృష్టికి సమస్యలు

నాగలాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆత్మీయ స్వాగతం పలికారు. చిన్న పాండూరు–పూడి రోడ్డు పూర్తికి సహకరించాలని సీఎం జగన్‌కు మంత్రి పెద్దిరెడ్డి కోరారు. సత్యవేడు నియోజకవర్గంలో పరిష్కారం కాని రెండు రోడ్డు సమస్యలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం నగరి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ఆదిమూలం వినతి పత్రం సమర్పించారు. సత్యవేడు నియోజకవర్గంలో నాగలాపురం –చిన్నపాండూరు, కేవీబీపురం మండలంలోని పూడి రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన సీఎం జగన్ అక్కడే ఉన్న తన సంయుక్త కార్యదర్శి భరత్ గుప్తాకు వినతిపత్రం ఇచ్చి పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమస్యలు ఆలకిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి అన్నారు. పట్టణంలోని 19వ వార్డు పరిధిలో మంచినీళ్ల గుంట ప్రాంతంలో సోమవారం ఆమె పర్యటించారు. ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సిమెంటురోడ్డు వేయాలని స్థానికులు కోరారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే భూమిపూజ చేస్తామని తెలిపారు. ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమేష్‌బాబు, నాయకులు పగడాల రాజు, మాధవ శంకర్, బాలగోపాల్, రాజా, వినోద్, రఫీ, రామయ్య, అర్జున్, బావాజీ, గౌస్, కృష్ణ, వంశీ, ప్రసాద్, మురళీయాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ ఆకస్మిక తనిఖీ



రేణిగుంట కార్యాలయంలో డీపీవో రాజశేఖర్‌రెడ్డి

రేణిగుంట: స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం డీపీవో రాజశేఖర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పన్ను బకాయిల వసూళ్లను పూర్తి చేయాలని పంచాయతీ ఈవో రవిశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. పంచాయతీ నిధుల సమీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేషం, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఈవో రవిశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, వార్డు సభ్యులు ఇరానీ ఖాదర్, ఖదీర్ తదితరులున్నారు.

పనిభారం తగ్గించాలని వినతి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కేవీబీపురం: రెండున్నర ఏళ్లుగా సజావుగా సాగుతున్న రేషన్ పంపిణీ వ్యవస్థలో డబుల్ తంబ్ సిస్టం సమస్యగా మారిందని, అధికారులు చర్యలు తీసుకుని తమకు పనిభారం తగ్గించాలని ఎండీయూ ఆపరేటర్లు విన్నవించారు. సోమవారం వారు స్థానిక తహసీల్దారు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈసీ మెంబర్ నాగయ్య మాట్లాడుతూ ఒక ఎండీయూ వాహనం ద్వారా సుమారు 2 వేల కుటుంబాలకు సేవలు అందిస్తామని, ఈ సేవలు గత జూలై వరకు సజావుగా సాగాయన్నారు. అయితే జూలై మాసం నుంచి ఒక్కో రేషన్‌కార్డుదారుని వద్ద నుంచి రెండుసార్లు ఫింగర్ స్కాన్ చేసే పద్ధతిని ప్రవేశ పెట్టడంతో తాము తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినప్పటికీ పరిష్కార మార్గం చూపలేదన్నారు. అదేవిధంగా ప్రభుత్వం వాహనాలకు చెల్లించిన నగదును బ్యాంకు వారు తక్షణం ఎండీయూ ఆపరేటర్లకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దారు స్పందిస్తూ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం రెవెన్యూలో ఉన్న ప్రభుత్వ భూమిలోకి ఎవరూ ప్రవేశించకూడదని హెచ్చరిక బోర్డును సోమవారం తహసీల్దారు భార్గవి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్కంబాకం గ్రామరెవెన్యూలో లెక్క దాఖల సర్వే నంబరు 81లో ఎటువంటి అనుమతులు లేకండా ఆక్రమణ, పంటల సాగు చేయరాదని, అందులోకి ప్రవేశించకూడదని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతి డబ్ల్యూ.పి.నంబరు 1070–2023 పెండింగులో ఉన్న కారణంగా ఈ ఉత్తర్వులు జారీ చేయడమైందని తెలిపారు. ఈ భూమిలో ప్రవేశించిన వారిపై సివిల్, క్రిమినల్ కేసులకు శిక్షార్హులని బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్‌ఓ తేజ, తదితరులు పాల్గొన్నారు.

జననేతకు ఘనస్వాగతం









నగరి పర్యటన సందర్భంగా సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, కళత్తూరు శేఖర్‌రెడ్డి, శ్రీమంత్‌రెడ్డి

ఏఎంసీ చైర్మన్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ జ్ఞానాంబ వారి మధురెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం వన్నెరెడ్డి జాగృతి సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పెండ్లిమండపం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్‌చేశారు. అనంతరం మధురెడ్డిని గజమాలతో సన్మానించారు. సుమారు 500మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు మధురెడ్డి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు కృష్ణారెడ్డి, మప్పేటి సుబ్రహ్మణ్యంరెడ్డి, సాయిరెడ్డి, జగదీష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, గజేంద్రరెడ్డి, జగదీష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, బాలాజీ, కుమార్‌రెడ్డి, గురవారెడ్డి, డిల్లీబాబ, శివ, జీవకేరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండ మల్లీశుని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరునికి పాలు, పెరుగు, పసుపు, కుంకుమతో అభిషేకించారు. తదుపరి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కలిపించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పురవీధుల్లో సీతారాముల చిద్విలాసం



పురవీధుల్లో ఊరేగుతున్న కోదండరామస్వామివారు



ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: తెపోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం శ్రీసీతా కోదండరాముల వారు పురవీధుల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్‌ను పట్టువస్త్ర సుగంధర భరిత పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీసీతాకోదండరాముల వారి ఉత్సవ విగ్రహాలతో పాటు లక్ష్మణ, ఆంజనేయ స్వామివారి విగ్రహాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

వందశాతం జీఈఆర్ సర్వే చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వే తప్పులు లేకుండా 100శాతం సమగ్రంగా చేయాలని ఎంఈఓ రవి ఆదేశించారు. సోమవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో జీఈఆర్ సర్వేపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సర్వేలో వారికి వస్తున్న సందేహాలను ఎంఈఓ రవి, ఎంపీడీఓ చంద్రశేఖర్ నివృత్తి చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చదువు ఇష్టం లేక మధ్యలో మానేసిన వాళ్లను స్కూల్ , కాలేజీల్లో చేర్పించి ఎన్‌రోల్ అయ్యేలా చేయాలని సూచించారు. ఇంటర్ కంప్లీట్ అయి డిగ్రీ చదవడం కోసం నిరీక్షిస్తున్న వాళ్లను సర్వేలో ఇంటర్ కంప్లీట్ ఆప్షన్ చాయిస్ పెట్టాలని సూచించారు. దివ్యాగులను గుర్తించి వెంటనే స్కూళ్లలో చేర్పించి ఎన్‌రోల్ అయ్యేలా చూడాలన్నారు. మ్యారేజ్ చేసుకున్న వారు, 18 ఏళ్ల పైబడిన వారు, ఉద్యోగం చేస్తున్న వారి పేర్లను ఇంటర్ కంప్లీట్ ఆప్షన్‌లో నమోదు చేయాలన్నారు. మరణించిన విద్యార్థుల వివరాలు సేకరించాలని సూచించారు. బడి బయటి పిల్లలను 100 శాతం గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ –2 ఉష, మండలంలోని 17 సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాగి పంట సాగుపై రైతులకు అవగాహన



రాగి పంటను పరిశీలిస్తున్న, అధికారులు, రైతులు

పాలసముద్రం : మండల పరిధిలోని రైతన్నలు చిరుధాన్యాల పంటల సాగులో రాగి పంట సాగుపై శ్రద్ధ పెట్టాలని ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. సోమవారం నరసింహపురం రైతు భరోసా కేంద్రంలో ఏఓ డిల్లీప్రసాద్ ఆధ్వర్యంలో రైతులతో సమీక్ష నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మహబూబ్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఆర్‌బీకే సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో రైతులు రాగి పంటను సాగు చేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. రాగి పంటకు గిట్టుబాటు ధర కిలో రూ.38 నిర్ణయించడం జరిగిందన్నారు. రాగి సాగుకు ఖర్చు తక్కువ, దిగుబడి, ఆదాయం చాలా ఎక్కువన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుపై శ్రద్ధపెట్టాలని కోరారు. అనంతరం నరసింహపురం సమీపంలో రైతు సాగు చేసిన రాగి పంటను పరిశీలించి వివరించారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలో వెలసిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నందీశ్వరుడికి, వాల్మీకేశ్వర స్వామివారికి ఏకకాలంలో ప్రదోష పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి కుటుంబ సమేతంగా ప్రదోష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి, ఆలయ నిర్వాహణ అధికారి రామచంద్రారెడ్డి దర్శన ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం స్వామివారి ఊరేగింపు భక్తుల హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణల నడుమ సాగింది. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, అర్చకులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజుకండ్రిగ శ్రీగౌరీ సమేత సోమనాథేశ్వర ఆలయంలో మహాప్రదోష పూజలు సోమవారం వైభవంగా జరిగాయి. అర్చకులు శ్రీ సోమనాథేశ్వరుని అభిముఖంగా ఉన్న నందీశ్వరున్ని పంచామృతాలతో అభిషేకించి, పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేపట్టారు. అనంతరం మహాహారతి సమర్పించారు. చివరగా శివపార్వతుల ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో కొలువుదీరిన గౌరీ సమేత శ్రీ సోమనాథేశ్వరునికి విశేష అభిషేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయ ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అధికారులు, భక్తులు



సోమనాథేశ్వరాలయంలో పూజలందుకుంటున్న నందీశ్వరుడు



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు